క్లుప్తంగా

క్రీడాకారులకు దుస్తులు అందజేత



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న గ్రామస్తులు

కోసిగి: మండల పరిధిలోని సాతనూరు గ్రామానికి చెందిన 12 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులకు అదే గ్రామానికి చెందిన నడుముకేరి రంగస్వామి క్రీడా దుస్తులను విరాళంగా అందజేశారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వాటిని పంపిణీ చేశారు. అలాగే మదర్ థెరిస్సా యూత్ అధ్యక్షుడు నజీర్ 12 మందికి షూలు అందించారు. గ్రామీణ ప్రాంత యువకులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈనెల 27, 28వ తేదీల్లో కోసిగిలో జరిగే ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ప్రతిభ చాటాలన్నారు. నాగేంద్ర, యువరాజు, రాంబాబు, ఈరన్న, బాబు, మాదేవా పాల్గొన్నారు.

ముమ్మరంగా రోడ్డు పనులు



డి.బెళగల్ గ్రామంలో రోడ్డు పనులు

కోసిగి: మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరైన రూ.20 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సహకారంతో గ్రామ ప్రధాన రోడ్డు నుంచి గ్రామంలోని పాఠశాల వరకు 350 మీటర్ల మేర రోడ్డు పనులు చేపట్టారు. ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం డ్రైనేజీ, సీసీరోడ్డు పనులు చేయిస్తున్నారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

గోశాలకు విరాళం



విరాళం అందజేస్తున్న విద్యార్థినులు

ఆదోనిఅర్బన్: ఆస్పరి మండలం కై రుప్పల గ్రామంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి గోశాలకు ఆదోనిలోని శ్రీగురుకృప కూచిపూడి నాట్యాలయ చిన్నారులు ఆదివారం రూ.20,400 విరాళం అందించారు. నాట్యాలయ గురువు వీరజోగాయల్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీని పోగుచేసి గోశాలకు విరాళం అందజేయడం అభినందనీయమని తెలిపారు. చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు, గోశాల సభ్యులు రుద్రయ్యస్వామి, చిన్నవీరేష్, నాగేష్, గోపాల్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోనిరూరల్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం నిర్వహించిన గ్రూప్–2 పరీక్ష నిర్వహణను సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ పరిశీలించారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న కోరారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ భవనంలో మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. ఈ నెల 27న ఉద్యోగుల చలో విజయవాడ కార్యక్రమం చేపడితే నోటీసులు జారీ చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రామాంజనేయులు, షేక్షావలి, రామ్మోహన్‌రెడ్డి, బాలాజీ నాయక్, పవన్ కళ్యాణ్, గంగా నాయక్, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం కేసీ కాల్వకు ఆదివారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.201 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

పేదల స్థలాలకు సర్వహక్కులు

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా వాటిపై పూర్తి హక్కు కల్పిస్తోంది. సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్లు చేసి ఇస్తోంది. ఇందుకు అయ్యే వ్యయాన్ని కూడా భరిస్తోంది. ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు పదేళ్ల తర్వాత సర్వ హక్కులు లభించనుంది. బ్యాంకులో రుణం పొందవచ్చు లేదా అమ్ముకోవచ్చు.

- సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు
- పదేళ్ల తర్వాత విక్రయించుకునే అవకాశం
- కౌతాళం మండలంలో 80 శాతం పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



కౌతాళంలో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్న లబ్ధిదారులు

కౌతాళం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి వాటిలో మౌలిక వసతులు కల్పించింది. ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించింది. పేదలకు ఇంకా ఏదైనా చేయాలనే ఉద్దేశంతో మరో అడుగు ముందుకు వేసి ఆ స్థలాలకు పూర్తి హక్కులు కల్పించేందుకు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లు చేసి ఇస్తోంది. అది కూడా ఉచితంగా. దీంతో లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ల కోసం క్యూ కడుతున్నారు. కౌతాళం మండలంలోని 30 పంచాయతీల్లో 3234 మందికి జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలు ఇచ్చారు. ఇప్పటి వరకు 80 శాతం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి అయినట్లు తహసీల్దార్ అలెగ్జాండర్ తెలిపారు. మండల కేంద్రమైన కౌతాళంలో 673 మందికి గాను ఇప్పటి వరకు 558 మంది లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఉప్పరహాల్, కుంటనహాల్ గ్రామాల్లో వంద శాతం పూర్తయ్యింది. ఉరుకుందలో 203 మందికి గాను 185, రౌడూరులో 180 మందికి 135, అలాగే ఎరిగేరి గ్రామంలో 385 మందికి 210, చూడి గ్రామంలో 254 మందికి గాను 202, హాల్విలో 139 మందికి 112, తోవి గ్రామంలో 127 మందికి 122, కామవరంలో 131 మందికి 99, బాపురంలో 105 మందికి86, తిప్పలదొడ్డిలో 68 మందికి 59, గుడికంబాలిలో 60 మందికి 32, వల్లూరులో 59 మందికి గాను 57 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఈ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఈ నెలాఖరులోగా వందశాతం పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



ప్రభుత్వం ఇచ్చిన స్థలానికి మాకు పూర్తి హక్కు కల్పించడం సంతోషంగా ఉంది. ఎంతో విలువైన స్థలానికి ఇవ్వడమే కాకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. మిరప కోతలకు ఇటీవల గుంటూరు వెళ్లాను. అధికారులు విషయం చెప్పడంతో గ్రామానికి వచ్చి రిజిస్టర్ చేసుకున్నాను. మాలాంటి పేదలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

–ఈరమ్మ బంటకుంట గ్రామం

ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు



ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా పేదల జీవితాలు మారలేదు. జగన్ అధికారంలోకి వచ్చాక పేదల ఆర్థికాభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారు. ముఖ్యంగా మహిళలకు చేయూతనిస్తున్నారు. స్థలం ఇచ్చి ఇల్లు కట్టించి ఇచ్చారు. ఇప్పుడు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారు. ఈ ప్రభుత్వం చల్లగా ఉండాలి.

–ఉచ్చమ్మ, కుంటనహాల్ గ్రామం

ప్రతి పథకం ఇంటి వద్దకే వస్తోంది



బియ్యం నుంచి పింఛన్ వరకు ఇంటి వద్దకే వస్తున్నాయి. గతంలో ఏ పథకం పొందాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు వలంటీర్లే ఇంటికి వచ్చి పథకాలు పొందేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్నారు. అలాగే పేదల ఇళ్ల స్థలాలకు సర్వహక్కులు కల్పిస్తుండడం చాలా సంతోషంగా ఉంది.

–సవిత, ఉప్పరహాల్ గ్రామం

హరహర మహాదేవ.. శంభోశంకర







అలంకరణలో శంభులింగేశ్వరస్వామి, వాహనంపై లింగాన్ని ఊరేగిస్తున్న శివస్వాములు, ఊరేగింపులో శివభక్తులు

ఆదోనిఅర్బన్: శివరాత్రిని పురస్కరించుకుని శివమాల దీక్షాపరులు ఆదివారం శివయ్య ఉత్సవమూర్తితో పట్టణ ప్రధాన రోడ్లలో ఊరేగింపు నిర్వహించారు. ఓం నమఃశివాయ నామస్మరణతో పట్టణంలోని ప్రధాన రహదారులు మార్మోగాయి. శివయ్యలు ఒకరికొకరు విబూది చల్లుకుంటూ నృత్యం చేస్తూ భక్తిపారవశ్యంతో ముందుకు కదిలారు. పట్టణంలోని ప్రభాకర్‌టాకీస్ పక్కన వెలిసిన శ్రీశంభులింగేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, పూల అలంకరణ, అష్టోత్తరం, శరణగోష, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు శంభులింగేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు ఎల్‌బీ స్ట్రీట్, షరాఫ్‌బజార్, చిన్న మార్కెట్, నిర్మల్‌టాకీస్, కోట్ల కూడలి, పాత బస్టాండ్ మీదుగా ఆలయానికి చేరుకుంది. గురుస్వామి శైలేంద్రనాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గురుస్వాములు భాస్కర్, లింగోజీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరాయుడి సన్నిధిలో ఎంపీ, ఎమ్మెల్యే



మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి ప్రసాదాలు అందిస్తున్న ఈఓ, ప్రధానార్చకులు

పాణ్యం: మండల పరిధిలోని ఎస్ కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈఓ రామకృష్ణ, ఆలయ ప్రధానార్చకులు నారాయణ స్వామి, వీరయ్యస్వామి, సురేష్‌శర్మలు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహించుకున్నారు. వారికి స్వామి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.



నంద్యాల ఎంపీకి స్వామి వారి ప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో పవమానహోమం



హోమ పూజలు చేస్తున్న భక్తులు



రంగోలితో ఆంజనేయస్వామి ప్రతిమ

ఆదోనిఅర్బన్: పట్టణంలోని శ్రీమంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం శ్రీపవమాన హోమ పూజలు జరిగాయి. ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో మంత్రాలయం పీఠాధిపతి శ్రీసుబుదేంద్రతీర్థ మహాస్వామి సూచన మేరకు ఈ పూజలను నిర్వహించారు. ముందుగా మంగరాయ ఆంజనేయస్వామికి తేనె అభిషేకం, విశేష ఫలపంచామృతాభిషేకం, అలంకారం, నైవేద్యం, మహామంగళహారతి ఇచ్చారు. అనంతరం వేద పండితులు పవనామ హోమం, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. పూజారి గురురాజా ఆచారి, ఆలయ కమిటీ సభ్యులు సకతే శ్యామ్‌ప్రసాద్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

27న వాహనాల వేలం

ఆలూరు రూరల్: జిల్లా సెబ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఈ నెల 27వ తేదీ వేలం వేస్తున్నట్లు ఆలూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సోమశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 15 స్కూటర్లు, 1 స్కార్పియో, 1 టాటా ఏస్ ట్యాలీ ఆటో వేలానికి ఉంచినట్లు తెలిపారు. ఆసక్తిగల వారు రూ.3 వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. స్థానిక సెబ్ పోలీసు స్టేషన్ ఆవరణలో 27న ఉదయం 10 గంటలకు వేలంపాట ఉంటుందని వెల్లడించారు.

తోంటదార్య ఆరాధన ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న స్వాములు, భక్తులు

కౌతాళం: మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో తోంటదార్యమ ఆరాధన ఉత్సవాలు ఆదివారం ఉదయం ప్రారంభయ్యాయి. తెల్లవారుజామున సుప్రభాతసేవ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మహంతలింగ శివాచార్య కరెగుడ్డ చేతుల మీదుగా ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి, ఐక్యమత్యం కోసం కుల మతాలకు అతీతంగా సన్మార్గంలో ప్రజలను నడిపించేందుకు ప్రవచనాలు నిర్వహిస్తామన్నారు. మార్చి 5వ తేదీ వరకు ఈ ప్రవచనాలు జరుగుతాయని తెలిపారు. మఠంలో పేద విద్యార్థులకు ఉచిత ప్రసాద నిలయం (హాస్టల్)నిర్వహిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పేద విద్యార్థులు పాఠశాలలో చదువుకుంటూ మఠంలో ఉచితంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో మఠం ఉత్తరాధికారి బసలింగ మహాస్వామి, శివమూర్తిశాస్త్రి పాల్గొన్నారు.

కారు బోల్తా - ఇద్దరికి గాయాలు



గాయపడిన శేషిరెడ్డికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

ఆలూరు రూరల్: కారు అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆలూరు మండలం హులేబీడు గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలు.. మొలగవల్లి గ్రామానికి చెందిన మల్లేశ్వర రెడ్డి తన కుంటుంబ సభ్యులతో కలిసి ఆదోనికి వెళ్తుండగా హులేబీడు గ్రామ సమీపంలోని ఎస్ఆర్‌కే క్వారీ మలుపు వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రత్నమ్మ, శేషి రెడ్డి తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి రెఫర్ చేశారు.

భక్తిశ్రద్ధలతో 'షబ్ ఏ బరాత్'



జిలేబీలు కొనుగోలు చేస్తున్న ముస్లింలు

కర్నూలు (న్యూటౌన్): నగరంలో ఆదివారం షబ్ ఏ బరాత్ (బడీరాత్)ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రాత్రి అన్ని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు, ప్రార్థనలు చేశారు. అనంతరం ఖబరస్తాన్‌కు వెళ్లి చనిపోయిన తమ పూర్వీకుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాతబస్టాండు, కొత్త బస్టాండు, సీ క్యాంప్ సర్కిల్, బళ్లారి చౌరస్తాలో షబ్ ఏ బరాత్ సందర్భంగా రకరకాల జిలేబీలను తయారు చేసి విక్రయించారు.

క్షమాపణ కోరుకునే రాత్రి

ముస్లిం సోదరులందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో నమాజ్‌లు, చదివి, దువా చేస్తూ తాము చేసిన పాపాలను క్షమించమని అల్లాహ్‌ను హృదయపూర్వకంగా ప్రార్థించే రోజు షబ్ ఏ బరాత్. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం షబాన్ నెలలో 15వ తేదీని షబ్ ఏ బరాత్‌గా జరుపుకుంటారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మానవులందరి భవిష్యతుకు ఈ రాత్రే మార్గనిర్దేశం చేస్తారని ముస్లింల విశ్వాసం.

ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేద్దాం



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదోనిరూరల్: ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధన కోసం ఈనెల 28వ తేదీ కర్నూలులో జరిగే ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేద్దామని సమితి జిల్లా నేత బండారి గిడ్డయ్య మాదిగ, ఆదోని పట్టణాధ్యక్షుడు గుమ్మల బాలస్వామి మాదిగ అన్నారు. ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆదోనిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలంతా ఉద్యమించాలని కోరారు. సద్దాం హుసేన్, మదిరె తిమ్మప్ప, మదిరె అంజి, మైనార్టీ నాయకులు నిషార్, జిలాన్‌బాషా, అంజనప్ప, జగ్గుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపు కేసులో నోటీసులు జారీ



సీజ్ చేసిన హిటాచీ

కర్నూలు (న్యూటౌన్): కౌతాళం మండలం మరళి గ్రామ పరిధిలో ఫిబ్రవరి 21న అక్రమంగా ఇసుక తవ్వుతున్న కర్ణాటకకు చెందిన హిటాచీని సీజ్ చేసి నోటీసులు జారీ చేశామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు. రెవెన్యూ, మైనింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. మైనింగ్ డీడీ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తవ్వుతున్న హిటాచీని సీజ్ చేసి కౌతాళం పోలీస్ స్టేషన్‌లో పెట్టామన్నారు. హిటాచీ యజమాని కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా మాన్వి గ్రామానికి చెందిన శరణబసవ అని విచారణలో తేలిందన్నారు. కర్ణాటక నుంచి ఏపీలోకి హిటాచీతో ప్రవేశించి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపినందుకు నోటీసు జారీ చేశామన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

హొళగుంద: దసరా బన్ని ఉత్సవాలకు ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి విరాట్‌మూర్తులకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని దర్శించుకోవడానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలో మూల విరాట్‌మూర్తులకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆదోనిఅర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ప్రముఖ ఎన్నారై కాకుబాళ్ నగేష్ సౌజన్యంతో ఆదోని వాసవీ కళ్యాణ మండపంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వాస్కులర్ ఆస్పత్రి వైద్యులు సుమారు 338 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి రూ.4,500 విలువైన కలర్డ్ డాప్లర్ టెస్ట్ ఉచితంగా చేశామని నిర్వాహకులు తెలిపారు. వ్యాస్కులర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అవోపా పట్టణ అధ్యక్షుడు వంకదారి శ్రీనాథ్‌గుప్తా, కార్యదర్శి మిర్యాల శ్రీధర్, టీజీ పాండురంగయ్యశెట్టి, టీజీ తారానాథ్, రాచోటి సుధాకర్, డాక్టర్ వికాస్, డాక్టర్ సోమాచారి, నగేష్, డైమండ్ రఘు, సభ్యులు ఈరన్నశెట్టి, వెంకటేష్, రాజేష్, సంగీత, మమతశ్రీ, హిమబిందు, గీత, సంతోషి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషా పరిరక్షణ అందరి బాధ్యత



సదస్సులో సన్మానం అందుకున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: మాతృభాషా పరిరక్షణ అందరి బాధ్యత అని సాహితీ వేత్త డాక్టర్ బి.వి. స్వరూప్ సిన్హా అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా వారోత్సవాల్లో భాగంగా తెలుగు కళ్లం సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం బీక్యాంప్‌లోని కల్లూరు విశ్రాంత ఉద్యోగుల సేవా సమితి కార్యాలయంలో ' తెలుగు భాష ద్రోహుల్ని వెలివేద్దాం తెలుగు భాష పిపాశకుల్ని ప్రోత్సహిద్దాం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషపై మక్కువ పెరిగేలా యువతలో చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వభాషల్లో తెలుగు వెలుగొందాలన్నారు. సమితి అధ్యక్షుడు చిన్నావుల వెంకటరాజారెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో కవులు, రచయితలు ప్రతాపరెడ్డి, బెల్దోనా కృష్ణమూర్తి, శేషఫణి శర్మ, లక్ష్మీనారాయణ, నిర్మలాదేవి మాట్లాడారు. కార్యక్రమంలో సమితి సభ్యులు చలపతి, నాగరాజు, తిమ్మారెడ్డి, మీసాల రఘు, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

మద్దికెర: మద్దమాంబ రథోత్సవం సందర్భంగా మద్దికెరలో ఆదివారం నిర్వహించిన వృషభాల బండలాగుడు పోటీలను పత్తికొండ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. రసవత్తరంగా సాగిన పోటీల్లో నంద్యాల జిల్లా యస్.కొత్తూరుకు చెందిన బీరం బుల్స్, బీరం సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి వృషభాలు మొదటి, ద్వితీయ బహుమతి రూ.60 వేలు, రూ.40 వేలు గెలుచుకున్నాయి. అనంతపురం జిల్లా సోమలదొడ్డి, పెద్దవడుగూరుకు చెందిన వృషభాలు రూ.30 వేలు, కర్నూలు జిల్లా పగ్గిడాల గ్రామం కోరల గిరజ వృషభాలు రూ.20 వేలు, అనంతపురం జిల్లా యంగణపల్లె శశికళ వృషభాలు రూ.10 వేలు, కర్నూలు జిల్లా పులికొండ రంగస్వామినాయుడు వృషభాలు రూ.5 వేలు గెలుచుకున్నాయి. నిర్వాహకులు శ్రీనివాసులు, కిట్టి, ఖాజావలి వృషభాల యజమానులకు బహుమతులను అందజేశారు. పోటీలను తిలకించానికి వచ్చిన వారికి గ్రామానికి చెందిన నాగేష్, కిట్టి అన్నదానం చేశారు.

వాహనాల తనిఖీ



వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ కృష్ణమూర్తి

మంత్రాలయం: మాధవరం చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఐ కృష్ణమూర్తి ఆదివారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమ మద్యం, నగదు తరలిరాకుండా వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 24 గంటల పాటు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు రికార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఓర్వకల్లు: మండల పరిధిలోని నన్నూరు గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఏపీ03జెడ్ 5194 నంబరు గల ఆర్టీసీ బస్సు నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తుండగా నన్నూరు వద్ద టైరు పంక్చరై వ్యతిరేక దిశలో వస్తున్న పుల్లగుమ్మికి చెందిన ఏపీ39 యూ0454 నంబర్ గల ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఉరుకుందమ్మ, వీరేష్, రవికుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పతిరకి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.